క్లుప్తంగా

సద్గురు సాయి సంస్థానం వార్షికోత్సవం



తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి అమరావతి రోడ్డులో వున్న సద్గురు సాయి సంస్థానం 8వ వార్షికోత్సవం గురువారం ఆలయ నిర్వాహకులు సత్యనారాయణ (మెడికల్ షాపు) మరియు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజారి ఫణిశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి ప్రారంభమైన పూజా కార్యక్రమాలు సాయంత్రం 7 గంటలవరకు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీని పరిశీలించిన కమిషనర్



తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో సిబ్బంది లబ్ధిదారులకు పెన్షన్లు అందజేస్తున్నారు. గురువారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ పెన్షన్ దారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, దివ్యాంగులు, వితంతువులు, చక్రాల కుర్చీలో ఉండే దివ్యాంగులు, మంచాలలో ఉండే వృద్ధులకు స్వయంగా ఇంటికి వెళ్లి పెన్షన్ అందజేయాలని సూచించారు. సచివాలయ సిబ్బంది తమ తమ వార్డులలో పెన్షన్ లబ్ధిదారులకు పెన్షన్ సక్రమంగా అందేలా చూడాలని సూచించారు. అనంతరం పలు సచివాలయాల్లో పర్యటించి పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు.

డిపాజిట్లపై అత్యధిక వడ్డీ

ఫిరంగిపురం: డిపాజిట్లపై అత్యధిక వడ్డీరేటు ఇస్తున్న ప్రభుత్వరంగ సంస్థ చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంకు అని ఆ బ్యాంకు బ్రాంచి మేనేజర్ జె.దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని 113త్యాళ్లూరు గ్రామంలో గురువారం నూతనంగా సేవింగ్ ఎకౌంట్లు ఓపెన్ చేయించే ప్రక్రియ నిర్వహించారు. ఈసందర్భంగా బ్యాంకు సిబ్బంది ఇంటింటికి వెళ్లి కొత్తగా సేవింగ్ ఎకౌంట్లు తీసుకునేందుకు గాను సంబంధిత అప్లికేషన్లు అందజేశారు. ఈసందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నూతనంగా గ్రామంలో బ్రాంచి ఏర్పాటు చేయడంతో కొత్త సేవింగ్స్ ఎకౌంట్లు తెరుస్తున్నట్లు తెలిపారు. రైతులకు క్రాప్ లోన్లు అందజేస్తామన్నారు. అంతేకాక గ్రాము బంగారం పై రూ. 4,700 రుణం అందజేస్తున్నట్లు తెలిపారు. వాటితో పాటు గృహ, విద్యారుణాలు అందజేస్తామని చెప్పారు. ఇప్పటివరకు 75 మందిచే నూతనంగా ఎకౌంట్లు తెరచినట్లు ఆయన తెలిపారు. క్యాషియర్ నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

మంగళగిరి అసెంబ్లీ టికెట్ కాంగ్రెస్‌కు కేటాయించాలి

కుర్రా పున్నారావు విజ్ఞప్తి

తాడేపల్లిరూరల్: మంగళగిరి కాంగ్రెస్ అసెంబ్లీ టికెట్ ఇండియా కూటమి కాంగ్రెస్ పార్టీకి కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబీసీ చైర్మన్ కుర్రా పున్నారావు కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. ఎంటీఎంసీ పరిధిలోని నిడమర్రులో గురువారం ఆయన నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పున్నారావు మాట్లాడుతూ రాష్ట్ర రాజధానిలో కాంగ్రెస్ పార్టీ పోటీ చేయకపోతే రాజధాని కేంద్రంలో భవిష్యత్తులో పార్టీ బలహీన పడడంతో పాటు ఆ ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా పడుతుందన్నారు.

దివ్యాంగులు ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకోవాలి

మంగళగిరి: దివ్యాంగులు ఏప్రిల్, మే, జూన్ నెలల కాలానికి సదరన్ ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవా కేంద్రాలలో దరఖాస్తులు చేసుకోవాలని ఎంటీఎంసీ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్వాన్స్ స్లాట్ బుకింగ్‌లను గ్రామ వార్డు సచివాలయాలలో, మీసేవా కేంద్రాలలోను దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి రూరల్: నేడు మంగళగిరి పట్టణ ప్రాంతంలో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కుల సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 33/11 కేవీ మంగళగిరి ఆటోనగర్ సబ్‌స్టేషన్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని 11కేవీ టౌన్, 5 ఫీడర్ మరమ్మతుల నిమిత్తం పాత మంగళగిరి, సీతారామ కోవెల ప్రాంతం, అన్నపూర్ణ థియేటర్, దిగుడుబావి, ఎన్ఆర్ ఎదురు, లక్ష్మీ నరసింహరావు కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల అత్యవసర మరమ్మత్తుల నిమిత్తం ఉదయం 7.30 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి

- ఎన్నో సంవత్సరాలు నగర వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు
- గతంలో రోడ్లు ఎలా ఉన్నాయో.. ఇప్పుడు ఎలా ఉన్నాయో బేరీజు వేసుకోండి
- మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుంది
- ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్కే. చిత్రంలో ఎమ్మెల్సీ మురుగుడు, ఎమ్మెల్యే అభ్యర్థి లావణ్య

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా గతంలో ఎన్నడూ జరగని విధంగా అభివృద్ధి పనులు చేసి చూపించాం. మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు అన్నారు. గురువారం రాత్రి మంగళగిరి పట్టణ పరిధిలోని 6వ బెటాలియన్‌లో విశ్రాంత ఉద్యోగులు, ఇతర ఉద్యోగులు, స్థానికులతో కలసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ మురుగుడు లావణ్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెట్టారని, బీసీ మహిళ అయిన ఆమెను మనం ఎమ్మెల్యేగా చేసుకుంటే మంగళగిరి నియోజకవర్గాన్ని, మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. 6వ బెటాలియన్‌లో ఏళ్ల తరబడి మురుగునీటి సమస్య, తాగునీటి సమస్య, రోడ్ల సమస్య ఉన్నాయని విశ్రాంత ఉద్యోగులు అడిగిన వెంటనే కార్పొరేషన్‌లో ప్రత్యేక నిధులు కేటాయించి జాతీయ రహదారి నుంచి 6వ బెటాలియన్ వరకు 60 అడుగల రోడ్డును నిర్మించి సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరు నామకరణం చేశామని, మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు డ్రైనేజీ ఏర్పాటు చేశామని, తాగునీటి సమస్యను కొంత మేర పరిష్కరించామని, 6వ బెటాలియన్‌కు అనుసంధానంగా వున్న ఎన్నడూ తట్ట మట్టి కూడా వేయని రోడ్లలో గ్రావెల్ రోడ్లు వేసి సిసి రోడ్ల నిర్మాణం వైఎస్సార్‌సీపీ హయాంలోనే టెండర్లు పిలిచామని, త్వరలోనే ఆ రోడ్లు కూడా నిర్మాణం పూర్తి చేస్తామని వారు అన్నారు. మురుగుడు లావణ్య విద్యావంతురాలని, ఆమెతో పాటు గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా కిలారి రోశయ్య పోటీచేస్తున్నారని వీరిద్దరి గెలుపు కోసం మనందరం ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసిఅఖండ మెజార్టీతో గెలిపించాలని వారు అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పెనుమాక మదీనా మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు

పెనుమాకలో ఇఫ్తార్ విందు..

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పెనుమాక మదీనా మసీదు అధ్యక్షుడు ఎస్‌కే మహబూబ్ మహమ్మద్ సుభాని ఆధర్యంలో రంజాన్ పండుగ సందర్భంగా గురువారం రాత్రి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) మంగళగిరి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్యలు విచ్చేశారు. మసీదులో ఇమామ్ మొహమ్మద్ ఆరిల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కేలు ముస్లిం సాంప్రదాయంలో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ పండుగ త్యాగానికి ప్రతీకని ముస్లింలు వారు సంపాదించిన సంపాదనలో కొంత భాగం పేదప్రజలకు ఖర్చు చేస్తారని, రంజాన్ పండుగను వైభవంగా జరుపుకోవాలని అన్నారు. వైఎస్సార్ సీపీ కన్వీనర్ మేకా దామేశ్వర్ రెడ్డి, ఎస్‌కే బషీర్, సొసైటీ అధ్యక్షుడు మేకా శివారెడ్డి, అంజిరెడ్డి, మేకా వెంకటరెడ్డి, బొక్కా ప్రసన్న (నాని), ఎంపీటీసీ మాజీ సభ్యుడు కళ్ళం అరవిందరెడ్డి, భవనం రవీంద్రరెడ్డి, జిలాని, కరీముల్లా, అబ్దుల్లా, మహబూబ్ ఖాన్, భాస్కరరెడ్డి, పలగాని సాంబశివరావు, పోలిశెట్టి సాంబశివరావు, మీరావలి పాల్గొన్నారు.

మా అవస్థలు చంద్రబాబు పుణ్యమే!

- వృద్ధులు, పింఛన్ లబ్ధిదారుల ఆవేదన
- సచివాలయాల్లో వేగంగా పింఛన్ల పంపిణీ
- ఉదయం 7 గంటలకే ప్రారంభించిన అధికారులు



మేడికొండూరు మండలం దోగిపర్రులో పింఛన్ల కోసం సచివాలయం వద్ద వేచి ఉన్న వృద్ధులు

మంగళగిరి/ఫిరంగిపురం/మేడికొండూరు : నగరంలోని సచివాలయాలలో శరవేగంగా పింఛన్ల పంపిణీ కొనసాగుతుంది. బుధవారం మధ్యాహ్నం నుంచి పింఛన్లు పంపిణీ ప్రారంభించగా గురువారం ఉదయం ఏడు గంటల నుంచే సచివాయాలలో పింఛను పంపిణీ చేపట్టారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. చంద్రబాబు పుణ్యమా అని మాకు ఈ కష్టాలు వచ్చాయని లేకపోతే ఇంటి వద్ద కూర్చుని పింఛను తీసుకునేవాళ్లమని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు.

గతంలో ప్రశాంతంగా ఉండేది..



నేను మూడో వార్డులో ఉంటున్నాను. పింఛను 8వ వార్డు సచివాలయంలో ఇస్తారు. కిలోమీటరుకి పైగా దూరం వుంది. ఎండల్లో నడిచి రావాలంటే రాలేక, ఆటోలో రావాల్సి వస్తుంది. గతంలో ఇంటివద్దే ప్రశాంతంగా పింఛన్ తీసుకునేదాన్ని. ఇంటికి వచ్చే పింఛన్లు ఆపిన చంద్రబాబుకు బుద్ధి చెబుతాం.

– కుంచాల భాగ్యమ్మ, మంగళగిరి

చంద్రబాబు నిర్వాకంతోనే ఇబ్బందులు..



గత ఐదు సంవత్సరాలుగా ఎలాంటి ఇబ్బంది లేకుండా జగన్‌బాబు ఒకటో తేదీనే ఇంటికే వలంటీర్లతో పింఛను పంపించాడు. ఇప్పుడు ఇంటికి పింఛను వద్దని చంద్రబాబు చేసిన ఫిర్యాదుతో అధికారులు సచివాలయాల వద్ద ఇస్తారని చెప్పడంతో నడవడం ఇబ్బందైనా కర్ర సాయంతో ఆపసోపాలు పడుతూ వచ్చాను. చంద్రబాబు పాలనలో పింఛను తీసుకోవాలంటే నరకం చూపించాడు. మళ్లీ ఇప్పుడు చంద్రబాబు నిర్వాకంతో ఇబ్బంది పడుతున్నాం.

– పసుపులేటి కోటేశ్వరమ్మ, మంగళగిరి

మళ్లీ జగన్ బాబు వస్తేనే మాలాంటోళ్ల కట్టాలు తీరతాయి



వాలంటీరు బాబు ఇంటివద్దకే వచ్చి పింఛను ఇచ్చేవాడయ్యా... ఇప్పుడు నాలుగు గంటలుగా చూసి, చూసి పింఛను తీసుకున్నానయ్యా... పాత పద్ధతి అయితేనే బాగుంటది. మళ్లీ జగన్ బాబు వత్తేనే మాలాంటోళ్ల కట్టాలు తీరతాయి.

– వి.సుబ్బులు, వృద్ధురాలు, ఫిరంగిపురం

వాహనాల తనిఖీ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని చర్చిసెంటర్‌లో గురువారం సాయంత్రం సీఐ వీరేంద్రబాబు వాహనాలను తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌లో భాగంగా వాహనాలను తనిఖీచేసినట్లు తెలిపారు. ఎటువంటి రసీదులు లేకుండా రూ. 50వేలకు మించి నగదు తీసుకు వెళ్లరాదని, లేదని తీసుకుని వెళితే స్వాధీనం చేసుకోవాల్సి వస్తుందని చెప్పారు. అనంతరం పలు వాహనాలను తనిఖీ చేశారు. ఎస్ఐ వీరనారాయణ, రైటర్ దాసు, సుబానీ, గంగరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి

తాడికొండ: గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన తాడికొండ మండలం మోతడక గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి పెనుముచ్చు అంజమ్మ (80) అనే వృద్ధురాలు రోడ్డుపై నడిచి వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో గాయాలపాలై మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు.

తనిఖీల్లో రూ.50,300 స్వాధీనం

తాడికొండ: తాడికొండ – కంతేరు రహదారిలో ఫ్లెయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహిస్తుండగా శ్రీసిటీ వెంచర్ సమీపంలో చినకాకానికి చెందిన నూతక్కి నవీన్ కుమార్ వద్ద నుంచి రూ.50,300 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఎలాంటి రసీదులు లేని కారణంగా నగదును ఐటీ అధికారులకు అప్పగించనున్నట్లు ఆయన తెలిపారు.

7న వృద్ధుల్లో ఊపిరితిత్తుల సమస్యలపై అవగాహన

తెనాలి: వాకర్స్ క్లబ్, తెనాలి ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ ఉదయం కొత్తపేటలోని స్టేట్ పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఆరోగ్య అంశంపై సమావేశం నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో క్లబ్ అధ్యక్షులు వెంకటరత్నం గురువారం తెలియజేశారు. ఉదయం 7 గంటలకు ఏర్పాటయ్యే సమావేశంలో ప్రముఖ ఊపిరితిత్తుల నిపుణులు డాక్టర్ యలమంచిలి కావ్య 'వృద్ధులు–ఊపిరితిత్తులలో మార్పులు–శ్వాసకోశ వ్యాధులు–నివారణ' అనే అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు. సభ్యులంతా తప్పక పాల్గొని విజయవంతం చేయాలని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గుత్తా వెంకటరత్నం, కడియాల రవిబాబు కోరారు.

ఓటు హక్కు వినియోగించుకోండి



సెల్ఫీ దిగుతున్న సబ్ రిజిస్ట్రార్ బాలగురవయ్య

తెనాలిఅర్బన్: ఓటు హక్కును అందరూ వినియోగించుకోవాలని తెనాలి సబ్ రిజిస్ట్రార్ కె.బాలగురవయ్య కోరారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై కొత్తపేటలోని సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఎన్నికల కమిషన్ ఓటు హక్కు కల్పించిందని చెప్పారు. మే 13న జరిగే ఎన్నికల్లో అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.



ప్లకార్డులతో మహిళలు

అనంతరం ఆయన ఓటర్ సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటో దిగారు. అలాగే ఓటు వేస్తామనే ప్రతిజ్ఞను చేశారు. కార్యక్రమంలో కమిషనర్ బి.శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ అనూష, ఏసీపీ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు పాల్గొన్నారు.

పేదలకు ఆహారపొట్లాల పంపిణీ

తెనాలి: పట్టణానికి చెందిన శ్రీసాయి ప్రసాదం సేవాసమితి నిర్వహణలో గురువారం చినరావూరు డొంకలోని మారుతి ఆలయ ప్రాంగణలో అన్నదానం చేశారు. సేవాసమితి అధ్యక్షుడు సాయి లక్కరాజు ఆధ్వర్యంలో వందమంది పేదలకు ఆహారపొట్లాలను అందజేశారు. సాయినాథునికి అత్యంత ఇష్టమైన అన్నదాన వితరణను ప్రతినెల తొలి గురువారం చేపడుతున్నామని గుర్తు చేశారు. స్టేట్ బ్యాంక్ అధికారిగా పనిచేసి, తన 84వ ఏట కన్ను మూసిన పురిగిళ్ల లక్ష్మీనారాయణశర్మ విగ్రహాన్ని హైదరాబాద్‌లోని సైదాబాద్ బ్యాంక్ కాలనీలో ఏర్పాటు చేస్తున్న సందర్భంగా, ఆయన కుమారుడు, ఎస్‌బీఐ, హైదరాబాద్ ప్రాంతీయ అధికారి ప్రశాంత్‌కుమార్ సౌజన్యంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలోని పేదలు ఎవరైనా కోరినట్టయితే వారి కాలనీలోనే భోజనాన్ని అందించగలమని సేవాసమితి సభ్యుడు, విశ్రాంత ఎంపీడీవో జె.వెంకటరమణ చెప్పారు. ఆలయ అధ్యక్షుడు దేశయ, విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి కోటేశ్వరరావు, సురేష్ పాల్గొన్నారు.



నేడు జగ్జీవన్‌రామ్ జయంతి

తెనాలిఅర్బన్: భారతదేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతిని తెనాలి పట్టణంలో శుక్రవారం నిర్వహించనున్నట్లు బీజేఆర్ జయంతి కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు డాక్టర బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు నివాళులు, సాయంత్రం 4 గంటలకు కొత్తపేటలోని రామకృష్ణ కవికళాక్షేత్రంలో ప్రముఖ దళిత మేధావులతో సంస్కరణ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. తెనాలి, పరిసర ప్రాంత ప్రజలందరూ పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ

తెనాలిఅర్బన్: సామాజిక పింఛన్ల పంపిణీ గురువారం కొనసాగింది. పట్టణంలోని 40 వార్డుల పరిధిలోని 47 సచివాలయాల్లో ఉదయం నుంచే పింఛన్లు పంపిణీ చేశారు. పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు లబ్ధిదారులకు తెలియడంతో ఆయా సచివాలయాలకు వచ్చి క్యూలో నిల్చుని నగదును తీసుకువెళ్లారు. మరికొందరు ఉద్యోగులు వికలాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. పట్టణంలో సాయంత్రం ఆరు గంటల సమయానికి సుమారు 87శాతం పింఛన్ల పంపిణీ పూర్తి అయినట్లు అధికారులు తెలిపారు.

విద్యార్థులు లిబరల్ ఆర్ట్స్‌లో పట్టు సాధించాలి



ఆచార్య థామస్ హన్సెస్ సత్కరిస్తున్న ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఆచార్యులు

తాడేపల్లిరూరల్: ఇంజినీరింగ్ విద్యార్థులు లిబరల్ ఆర్ట్స్‌లోనూ పట్టు సాధించాలని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ హ్యూమానిటీస్ స్కూల్ ఆంత్రోపాలజీ హెడ్ ఆచార్య థామస్ హన్సెస్ సూచించారు. గురువారం ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలోని ఈశ్వరి స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో భారత విద్యావిధానంలో లిబరల్ ఆర్ట్స్ అంతర్గత రూపకల్పన అనే అంశంపై ప్రసంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీ హ్యూమానిటీస్ స్కూల్ ఆంత్రోపాలజీ హెడ్ ఆచార్య థామస్ హన్సెస్ మాట్లాడుతూ తమ చుట్టూ వున్న ప్రపంచం గురించి సంపూర్ణ అవగాహన పెంచుకునేందుకు లిబరల్ ఆర్ట్స్ దోహదపడుతుందన్నారు. అనంతరం థామస్ హన్సెస్‌ను యూనివర్సిటీ యాజమాన్యం ఘనంగా సత్కరించింది. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమ్ కుమార్, రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ రంజిత్ థాపా, ఈశ్వరి స్కూల్ డీన్ డాక్టర్ విష్ణువర్ధ్, డాక్టర్ ఆయేషా హరూన్, డాక్టర్ రజనీ ముత్రాల్, డాక్టర్ జీఎస్ వినోద్, డాక్టర్ రాజపాండ్య పాల్గొన్నారు.

నిర్మల ఫార్మసీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



ఎంపికైన విద్యార్థులతో ఇన్‌ఫ్లో క్రూరిస్ ప్రతినిధులు, నిర్మల కళాశాల యాజమాన్యం

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలలో ప్రముఖ బహుళ జాతీయ సంస్థ ఇన్‌ఫ్లో క్రూరిస్ ఆధ్వర్యంలో గురువారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పాములు రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఫార్మసీ కళాశాలల నుంచి 150 మంది విద్యార్థులు ఈ ఎంపికలకు హాజరయ్యారని, వివిధ పోటీ పరీక్షల అనంతరం 15 మంది ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన వారికి వార్షిక వేతనంగా రూ.3 లక్షలు జీతభత్యాలను అందజేస్తారని వివరించారు. ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. నిర్మల కళాశాల సెక్రటరీ సిస్టర్ నిర్మల జ్యోతి, కంపెనీ ప్రతినిధులు దీపక్, కుమారి గౌతమి, కార్తీక్, దుర్గాప్రసాద్, కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి ఎస్. కామేశ్వరరావు, డాక్టర్ సుధీర్, వి.జోజిబాబు, అశోక్ కుమార్, సాంకేతిక సిబ్బంది విజయ్‌కుమార్, శ్రీహరి, ప్రసాద్ పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు

మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా 107 మంది రాజీనామాలు సమర్పణ



ఈమనిలో పంచాయతీ సెక్రటరీ నవరాణికి రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గవ్యాప్తంగా గురువారం 107 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలో వివిధ సచివాలయాల్లో 58 మంది వలంటీర్లు, వడ్డేశ్వరంలో 10 మంది, చిర్రావూరులో 9, ప్రాతూరులో 6, కొలనుకొండ 5, ఇప్పటం 4, దుగ్గిరాల మండలం ఈమనిలో ఏడుగురు, పెరికలపూడిలో ముగ్గురు వలంటీర్లు రాజీనామా పత్రాలను సచివాలయ సెక్రటరీలకు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ కరోనా సమయంలో అధికారులతో, వైద్యులను సమన్వయం చేసుకుని తాము ఇంటింటికీ సేవలు అందించామని ఇప్పుడు తమపై అవాకులు చవాకులు మాట్లాడుతున్న నాయకులు అప్పుడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

దాతల సహకారంతో పాఠశాలలో బోరు ఏర్పాటు



విద్యార్థులకు మిఠాయిలు పంచుతున్న పాఠశాల ఉపాధ్యాయులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని మండల ప్రజాపరిషత్ మెయిన్ పాఠశాలలో దాతల సహకారంతో బోరును గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం మాట్లాడుతూ వేసవిలో నీటికొరతతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని పాఠశాల పేరెంట్స్ కమిటీకి తెలియజేశామని, వారు రూ.11,600 సహాయం అందించారని, అదేవిధంగా నారా కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూ.19 వేలు, ఈమని పాఠశాల ఉపాధ్యాయులు బంకా విజయ్‌కుమార్, బొప్పరాజు కోటేశ్వరరావు, పసుమర్తి ఏసుపాదం ఒక్కొక్కరు రూ.4వేలు చొప్పున 12 వేలు మొత్తం రూ.42,600తో బోరును ఏర్పాటు చేశామని తెలిపారు. దాతలు చీదెళ్ళ సత్యనారాయణ రూ.20 వేలతో పాఠశాలకు గేటును, లోకం పూర్ణచంద్రరావు రూ.15 వేల వ్యయంతో గేట్ వాల్‌ను నిర్మించారని తెలిపారు. పాఠశాలలో బోరు నిర్మాణం, గేటు, వాల్ నిర్మాణానికి సహకరించిన వారికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

జగనన్నతోనే ప్రతి ఇంటా వెలుగులు



తాడికొండలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మేకతోటి హర్షిత్

తాడికొండ: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ఇచ్చిన ప్రతిహామీ నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించుకుంటే ప్రతి ఇంటా వెలుగులు నిండుతాయని వైఎస్సార్ సీపీ తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత కుమారుడు మేకతోటి హర్షిత్ పేర్కొన్నారు. గురువారం గ్రామంలోని 12వ వార్డులో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన జగనన్న మీకు మేలు జరిగిందనుకుంటేనే ఓటు వేయాలని అడుగుతున్నారని, ప్రతి కుటుంబం మీకు జరిగిన మేలును గుర్తుంచుకొని వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని కోరారు. తాడికొండ నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనతల్లి మేకతోటి సుచరిత, ఎంపీగా కిలారి వెంకట రోశయ్య పోటీ చేస్తున్నారని, ఫ్యాను గుర్తుపై ఓటు వేసి వారిని అఖండ మెజారిటతో గెలిపించాలని కోరారు. ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి, నిడుముక్కల సర్పంచ్ మాదాసు రత్న కుమారి, స్థానిక నాయకులు తుమ్మల తిరుపతిరెడ్డి, ఉండవల్లి నరసింహారావు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు,స్కూటీ ఢీ : వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో బాల చిన్నారావు మృతదేహం

నాదెండ్ల: గుంటూరు–కర్నూలు రహదారిపై సాతులూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల వివరాల మేరకు.. ఫిరంగిపురం గ్రామానికి చెందిన ఒడిషా బాల చిన్నారావు (58)కొవ్వొత్తులు అమ్ముకుని జీవిస్తుంటాడు. ఎప్పటిలానే ఫిరంగిపురం నుంచి తన స్కూటీపై నరసరావుపేటకు బయలుదేరాడు. ఇదే సమయంలో నరసరావుపేట ఆర్టీసీ డిపోకు చెందిన అల్ట్రా డీలక్స్ బస్సు గుంటూరు వైపు వెళ్తోంది. సాతులూరు సబ్ స్టేషన్ వద్దకు రాగానే ఎదురెదురుగా బస్సు, స్కూటీ ఢీకొన్నాయి. దీంతో బస్సు చక్రాలకింద పడి బాలచిన్నారావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ట్రాఫిక్ ను నియంత్రించారు. వివరాలు నమోదు చేసుకుని, కేసు నమోదు చేశారు.